www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 23 మే 2024
5
వైఎస్ఆర్

అన్నదానం గొప్పది

అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-వల్లూరు
లక్ష్మీ నరసింహస్వామి జయంతి పురస్కరించుకొని భక్తులకు అన్నదాన కార్యక్రమం ముదుగోటి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని వల్లూరులో వెలసిన లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మల్లికార్జున్, హరిబాబు, పవన్ కుమార్, వెంకటేష్, మునేంద్ర, శేఖర్, వినయ్ పాల్గొన్నారు.

చీనీ సాగుకు రైతులు విముఖత

తెగులుతో ఎండిపోయిన రెండు సంవత్సరాల చీనీ చెట్టు

- అధిక తెగుళ్లే ప్రధాన కారణం
- ఎండిపోతున్న తోటలు
- 'ఉపాధి' లబ్ధిదారులూ అనాసక్తి

ప్రజాశక్తి సింహాద్రిపురం
జిల్లాలో చీనీ తోటల పెంపకానికి ప్రసిద్ధిగాంచిన సింహాద్రిపురం మండలంలో నేడు ఆ పంట సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. ముఖ్యంగా చీనీ చెట్లు నాటినప్పటి నుంచి ఆరేళ్ల పాటు ఎటువంటి ఆదాయం లేకుండానే పెంచాల్సిన పరిస్థితి ఉంది. ఆ తర్వాత 20, 22 సంవత్సరాల పాటు పంట దిగుబడులు వస్తాయి. రెండేళ్లుగా చీనీ చెట్లకు విపరీతమైన తెగులు కారణంగా దిగుబడి రాకుండానే చనిపోతున్నాయి. ఈ చెట్లను బతికించడానికి అనేక రకాల పురుగుమందులను పిచికారి చేసిన ఎలాంటి ప్రయోజనం కనిపించకపోవడంతో రైతులు తోటలను వదిలేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పంట చేతికి వస్తుందన్న సమయంలో కన్నబిడ్డలా సాకిన చీనీ చెట్లు ఎలాంటి పల సాయం ఇవ్వకుండానే నిట్ట నిలువునా ఎండి పోతుండడం పట్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నియోజవర్గ వ్యాప్తంగా దాదాపు 27 వేల హెక్టార్లలో చీనీ చెట్లు సాగులో ఉన్నాయి. గడిచిన రెండు సంవత్సరాల కాలంలో నాలుగు వేల హెక్టార్లలో చనిపోయిన చీనీ చెట్లను తొలగించి వాటి స్థానంలో అరటి, బొప్పాయి లాంటి ఇతర ప్రత్యామ్నాయ పంటల వైపు ఆసక్తి చూపుతున్నారు.

ఉపాధి హామీ పథకం లబ్ధిదారులు అనాసక్తి

నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి ఏడాది దాదాపు 3 వేల ఎకరాలలో ఉపాధి హామీ పథకం ద్వారా చీనీ తోటల సాగుకు ప్రోత్సాహం ఇస్తున్నారు. దీని ద్వారా ప్రతి లబ్ధిదారునికి ఒక్కొక్క ఎకరాకు మూడు సంవత్సరాల కాలానికి సంబంధించి రూ.1.50 లక్షలు ఇస్తారు. చీనీ చెట్లకు తెగులు అధికం కావడంతో ఉపాధి హామీ పథకంలో లబ్ధిదారులు గుర్తించినప్పటికీ వారు చీనీ సాగుకు ముందుకు రావడంలేదని తెలుస్తున్నది.

తెగుళ్ల గుర్తింపులో అధికారులు విఫలం

ఇటీవల కాలంలో చీనీ చెట్లకు సోకిన తెగుళ్లను ఉద్యానవన శాఖ అధికారుల సైతం గుర్తించలేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పురుగుమందుల డీలర్లు సూచించిన అనేక రకాల మందులు పిచికారి చేసి వేల రూపాయలు డబ్బులు పోగొట్టుకున్న ఫలితం మాత్రం శూన్యమని రైతులు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు దృష్టికి సైతం తీసుకెళ్లిన ఏం మాత్రం ప్రయోజనం లేదని రైతులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఉద్యాన శాఖ శాస్త్రవేత్తలు పరిశీలించి తెగులు నివారణకు మందులను సూచించాలని రైతులు కోరుతున్నారు.

తెగుళ్లు కారణంగా చెట్లను తొలగించా

రెండు సంవత్సరాల నుంచి చీనీ చెట్లకు విపరీతమైన తెగుళ్ల వచ్చాయి. రెండేళ్ల వయసు గల చెట్లను తొలగించా. తెగులు కారణంగా కాయలు కాపుకు రాని చెట్టు సైతం ఎండిపోతున్నాయి. అనేక మందులు కొట్టినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదు.

- సుబ్బారెడ్డి, చీనీ రైతు, గురజాల.

చీనీ చెట్లు నాటడానికి ఆసక్తి లేదు

గతంలో పులివెందుల ప్రాంతంలో ఉన్న చీనీ తోటలకు మంచి గుర్తింపు ఉండేది. తెగులు కారణంగా చీనిచెట్టు విపరీతంగా ఎండిపోతున్నాయి. అధికారులకు సూచించినప్పటికీ ప్రయోజనం కనిపించడం లేదు. చీనీ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- మహేశ్వర, చీనీ రైతు, తెలికి.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య

చీనీ చెట్లు మంజూరైన లబ్ధిదారులు నాటుకోవాలని సూచించినప్పటికీ తెగుళ్ల కారణంగా చనిపోతున్న విషయాన్ని తమ దృష్టికి తెచ్చారు. కొంతమంది రైతులు సాగుకు ఆసక్తి కనబరచడం లేదు. ఈ విషయాన్ని ఉద్యానవన శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తా.

- సుబ్బారెడ్డి, ఎపిడి, పులివెందుల.

కడపలో జగన్‌కు ఝలక్!

- డిప్యూటీ సిఎం ఓటమికి కుతంత్రం
- ఓ కీలక వైసిపి నాయకుడి వెన్నుపోటు
- అదేబాటలో ఏడుగురు కార్పొరేటర్లు
- వెన్నుపోటుపై వైసిపిలో గుసగుసలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి
కడపలో వైసిపి ఓటమికి కుతంత్రం నడిచింది. కడప అసెంబ్లీ అభ్యర్థి ఎస్‌బి.అంజాద్‌బాషా, పార్లమెంట్ అభ్యర్థి వైఎస్.అవినాష్‌రెడ్డికి వ్యతిరేకంగా కడపకు చెందిన ఓ కీలక నాయకుడి వెన్నుపోటు రాజకీయంపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈయన సహకారంతో మరో ఏడుగురు కార్పొరేటర్లు సైతం టిడిపి ఎరకు లొంగిపోయినట్లు సమాచారం. ఫలితంగా కడప అసెంబ్లీపై ముస్లిం మార్క్ తొలగిం చడానికి సహకారం అందించినట్లు తెలుస్తోంది. ఫలితం గా కడప అసెంబ్లీలో వైసిపి గెలుపు కోసం పోటాపోటీ పరిస్థితి తీసుకు రావడం చర్చనీయాంశంగా మారింది.

కడప అసెంబ్లీ పరిధిలో 2.83 లక్షల ఓటర్లు ఉన్నారు. ఈ నెల 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో 65.27 శాతం నమోదైంది. కడప అసెంబ్లీ బరిలో వైసిపి తరపున డిప్యూటీ సిఎం ఎస్‌బి.అంజాద్‌బాషా, టిడిపి తరుపున మాధవి, కాంగ్రెస్ తరుపున ఆఫ్జల్‌ఖాన్ ప్రధాన పార్టీల తరుపున అభ్యర్థులుగా పోటీ పడిన సంగతి తెలిసిందే. కడప జిల్లా ఎన్నికల చరిత్రలో ఎన్నడూ ఎరగని విధంగా ముగ్గురి మధ్య తీవ్రమైన పోటీ నెలకొన్న సంగతి తెలిసిందే. వైసిపి నాయకుల వెన్నుపోటు, లొంగుబాటు కారణాలు కావడం విస్మయాన్ని కలిగిస్తోంది.

రచ్చ గెలవడంలో డిప్యూటీ సిఎం ఎదురీత

సార్వత్రిక ఎన్నికల టికెట్‌ను దక్కించుకోవడంలో ఇంటిపోరు గెలిచిన డిప్యూటీ సిఎం.అంజాద్‌బాషా, వీధిపోరును గట్టెక్కడంలో ఎదురీదుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఆయనకు సన్నిహితుడైన ఓ కీలక వైసిపి నాయకుని వెన్నుపోటు కారణంగానే గెలుపు కోసం పోరాటం చేయాల్సిన దుస్థితి దాపురించిందనే చర్చ నడుస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 53 వేల ఓట్లపైచిలుకు గెలిచిన నాయకుడు, 2024 సార్వత్రిక ఎన్నికల్లో వెన్నుపోట్ల కారణంగా పోరాటం చేయాల్సిన రావడం గమనార్హం.

వెన్నుపోట్లు...లొంగుబాట్లు

వైఎస్ జగన్ రెండవ టర్మ్‌లో ముఖ్యమంత్రిగా కొనసాగడానికి ప్రతి సీటు కీలకం. ఇటువంటి సంగతి తెలిసినప్పటికీ కడప నగరానికి చెందిన సదరు నాయకుడు, ఓ అధికారి మధ్య వర్తిత్వంతో ప్రత్యర్థితో డీల్ కుదుర్చుకుని వెన్నుపోటుకు తెర తీశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంతటితో ఆగకుండా మరో ఏడుగురు కార్పొరేటర్లు సైతం ప్రత్యర్థికి లొంగిపోయి సైలెంట్‌గా వ్యవహరించారానే విమర్శలు ఉన్నాయి. సదరు నాయకుడు పార్టీలోనూ, పార్టీయేతర కీలక పదవిలోనూ కొనసాగుతూ ఇలా చేయడమేమిటనే చర్చ నడుస్తోంది. ఫలితంగా సదరు కీలక నాయకుడి పరిధిలోని ఓ సామాజికవర్గపు ఓటర్లు టిడిపి అభ్యర్థి వైపు మొగ్గ చూపిస్తున్నారని తెలిసినప్పటికీ ప్రేక్షకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. లొంగుబాటు నాయకులు జగన్‌కు ఝలక్ ఇచ్చినట్లు అవుతోందనే వాదన వినిపిస్తోంది. కడప అసెంబ్లీ పరిధిలో ప్రభావిత సామాజిక వర్గాలైన ముస్లిమ్, క్రిస్టియన్ ఓటర్లను ప్రత్యర్థులైన టిడిపి, కాంగ్రెస్ కొల్లగొట్టే ప్రయత్నం చేయడం తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల్లో బాధ్యులైన సదరు వైసిపి నాయకులు కలిసి కట్టుగా శ్రమించాలి. ఎటువంటి ప్రయత్నమూ చేయకుండా, పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలి. ఇటువంటి ప్రయత్నాలు చేయకుండా ప్రత్యర్థుల ఎరకు లొంగిపోయి, పార్టీకి, వైఎస్.జగన్ ముఖ్యమంత్రి అవకాశానికి వెన్నుపోటు పొడవడం చర్చనీయాంశంగా మారింది.

విశిష్టమైన కవిత్వాన్ని ఆవిష్కరించిన 'వేటూరి'

- ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి

వేటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రచయితలు, కళాకారులు

ప్రజాశక్తి-కడప అర్బన్
వేటూరి సుందర రామమూర్తి అత్యంత ప్రతిభావంతుడైన కవియని, తెలుగు సినిమా పాటల్లో ఆయన విశిష్టమైన కవిత్వాన్ని పండించారని, సినిమా పాటల్లో ఆయన రాసినంత గొప్ప కవిత్వం మరొకరు రాయలేదని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జురెడ్డి అన్నారు. వేటూరి వర్ధంతిని పురస్కరించుకొని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం బుధవారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్బులో వేటూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ వేటూరి కె.విశ్వనాథ్ దర్శకత్వంలో ఓసీత కథ ద్వారా సినిమా రంగానికి పరిచయమై వేలాది పాటలు రాసి గొప్ప కీర్తి నార్జించారన్నారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ పదాల పొందికలోను, బావుకతలోనూ ఆయన పాటలు ఎంతో బాగుంటాయని, సాగర సంగమం, శంకరాభరణం సినిమాల్లో పాటలు ఆయనకు అజరామరణమైన కీర్తిని తెచ్చాయని పేర్కొన్నారు. ప్రసిద్ధ రంగస్థలం నటుడు ఎ.విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ అడవి రాముడు, మల్లెపువ్వు, సిరిసిరిమువ్వ, సప్తపది, సీతాకోకచిలుక, స్వాతిముత్యం, సితార, మేఘసందేశం సినిమాల్లో వేటూరి గొప్ప పాటలు రాశారన్నారు. మరో రంగస్థల నటుడు ఎ.గంగయ్య మాట్లాడుతూ వేటూరిని ఆరు నంది పురస్కారాలు వరించాయని, ఆయన మరెన్నో ఉత్తమ పురస్కారాలు అందుకున్నారన్నారు. కార్యక్రమంలో మందల మురళి, తిప్పలూరు ఓబులేసు, వీరదాసరి ప్రకాశం, జ్యోతి జార్జి, బి.బాలఓబయ్య ఎ.గంగయ్య, తపలిస్ట్ గంగయ్య, టి.నారాయణయాదవ్ పాల్గొన్నారు.

పటిష్టంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ

- జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి విజయ్‌రామరాజు

ప్రజాశక్తి-కడప
సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని సజావుగా, పారదర్శకంగా, పటిష్టంగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రంలో నిరంతర నిఘా కెమెరాలు, ప్రత్యేక భద్రతా చర్యలను ఏర్పాటు చేశామని వైఎస్ఆర్ జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఎంసిసి అమలు, 144 సెక్షన్ పాటింపుపై జిల్లా ఎలెక్షన్ కంట్రోల్ రూమ్ ప్రత్యేక పర్యవేక్షకులు, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన రాజకీయ పార్టీల ప్రతినిధులందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నన్నారు. ఎన్నికల ప్రక్రియలో చివరి ఘట్టం అయిన ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని జూన్ 4వ తేదీన ఎంతో పటిష్టంగా పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్నిరకాల భద్రతా చర్యలను చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో 13,04,256 ఓట్లతో 79.57 శాతం పోలింగ్ టర్న్ అవుట్ నమోదయిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా జిల్లాలో అసెంబ్లీ నియో జకవర్గాలకు 22,669, కడప పార్లమెంట్‌కు 22,657 ఓట్లు పోలయ్యాయన్నారు. కడప రిమ్స్ సమీపంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో పాటు, పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లతో నిక్షిప్తమైన ఇవిఎంలను అత్యంత సురక్షితంగా భద్రపర్చాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో 112 సిసి కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. పార్లమెంట్, ప్రతి అసెంబ్లీ సెగ్మెంటులకు 14 చొప్పున ఇవిఎం టేబుళ్లను అలాగే పోస్టల్ బ్యాలెట్‌కు 14 టేబుళ్లను ఏర్పాటు చేయడమైనదన్నారు. బద్వేలుకు 20 కౌంటింగ్ రౌండ్లు, కడపకు 21, పులివెందులకు 22, కమలాపురంకు 18, జమ్మలమడుగుకు 23, ప్రొద్దుటూరు 20, మైదుకూరు 20 కౌంటింగ్ రౌండ్లను ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4న ఉదయం 8 గంటల నుండి ప్రారంభమవుతుందన్నారు. భద్రతా చర్యల్లో భాగంగా జూన్ 1వ తేదీ నుండి 6వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో గుర్తింపుపొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్య చైతన్య సాహితీమూర్తి 'కేతు'

కేతు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

ప్రజాశక్తి-కడప అర్బన్
తెలుగు సాహితీ లోకంలో కథకునిగా, నవలా కారునిగా, నాటక కర్తగా, పరిశోధకునిగా, సంపాదకునిగా, నిరంతర సృజనశీలిగా, నిత్య చైతన్య సాహితీ మూర్తిగా కేతు విశ్వనాథరెడ్డి తన సాహిత్య ప్రస్థానాన్ని కొనసాగించారని యోగి వేమన పాలక మండలి సభ్యులు, వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మొదటి వర్ధంతిని పురస్కరించుకుని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు ఆధ్వర్యంలో బుధవారం సంస్మరణ సభను నిర్వహించారు. తొలుత ఆచార్య కేతు చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కడప జిల్లా గ్రామ నామాలను ఆయా గ్రామాల్లో ఉన్న జీవన విధా నాన్ని నిశితంగా పరిశీలించి గొప్ప పరిశోధనచేసి కేతు పలువురి ప్రశంస లందుకున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ తాను పుట్టిన నేలకు తన చుట్టూ పెరిగిన సమాజానికి గొంతుకగా మారి రాయలసీమ కథకు చుక్కానిగా నిలిచారని, ఆయన కథలు దీన, దళిత శ్రామిక వర్గాల ప్రతినిధిగా నిలిచారని అన్నారు. రాయలసీమ టూరిజం సంస్థ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు మాట్లాడుతూ కేతు తన కథల్లో చెప్పదలచుకొన్న అంశాన్ని సూటిగా, స్పష్టం గా చెబుతారని ఆయన నిజ జీవితంలో కూడా ఎవరు ఏమనుకొన్నా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడుతారని తెలిపారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకొన్నారు. డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి మాట్లాడుతూ కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యాన్ని అనేక భాగాలుగా విభజించి తను సంపాదకునిగా సారథ్యం వహించి సంపాదకత్వానికే ఒక నూతన ఒరవడిని సృష్టించాడని అన్నారు. ప్రసిద్ధ రంగస్థల నటుడు మధు మాట్లాడుతూ కేతు సార్వత్రిక విశ్వ విద్యాలయంలో తెలుగు భాషా సాహిత్యాలకు చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మూల అయ్యవారురెడ్డి, డేవిడ్, గొబ్బూరి కోటేశ్వరరావు, విజయ్, సతీష్, బాబు, జ్యోతి జార్జి పాల్గొన్నారు.

ఆ బిఇడి కళాశాలకు వైవీయూ గుర్తింపు లేదు

ప్రజాశక్తి - కడప అర్బన్ : వైయస్సార్ జిల్లా పరిధిలోని ప్రొద్దుటూరు శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఉన్న శ్రీ మలయాళ స్వామి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బిఇడి)కు 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి నేటి వరకు యోగి వేమన విశ్వవిద్యాలయం నుంచి ఎలాంటి గుర్తింపు (అఫిలియేషన్) లేదని విశ్వవిద్యాలయ కాలేజీ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య కె.రఘుబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదరు కళాశాలలో బిఇడి ప్రవేశాలు పొందే విద్యార్థులకు విశ్వ విద్యాలయం ఎలాంటి బాధ్యత వహించదని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో న్యాయ స్థానాల మార్గదర్శకం మేరకు విశ్వవిద్యాలయ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

గుండెపోటుతో నగర పాలక సంస్థ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - కడప
కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో మెడికల్ హెల్త్ సెక్షన్‌లో పనిచేస్తున్న బత్తల కొండయ్య(52) గుండెపోటుతో మృతి చెందాడు. చాలా సంవత్సరాలుగా మున్సిపల్ ఉద్యోగిగా పనిచేస్తున్న బత్తల కొండయ్య బుధవారం ఉదయం తీవ్రమైన గుండెపోటు రావడంతో మృతి చెందాడు. కొండయ్య మృతి పట్ల మున్సిపల్ ఉద్యోగులు సంతాపం తెలియజేశారు.

డిఇడి స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశాలు

ప్రజాశక్తి-కడప అర్బన్ : హెలెన్ కెల్లర్ కాలేజీ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ కడపలో డిఇడి స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి.దౌలత్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రిహాబి లిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాచే గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. కోర్సులో చేరుటకు ఇంటర్మీడియట్ లేదా సమామానమైన కోర్సులో ఒసిలు 50 శాతం బిసి, ఎస్‌సి, ఎస్‌టి, పిహెచ్ విద్యార్థులు 45 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. బిఇడి స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు చేసిన వారు చెవిటి, మూగ బాల బాలికల ప్రత్యేక పాఠశాలలు, కళా శాలలు ఇంక్లూజివ్ స్కూల్స్ భవిత కేంద్రాలలో ఉపాధ్యాయులుగా పనిచే యుటకు అర్హులవుతారని పేర్కొన్నారు. కోర్సులో చేరదలచిన వారు జూన్ 14లోగా దరఖాస్తులను హెలెన్ కిల్లర్ కాలేజీ ఆఫ్ స్పెషల్ ఎడ్యు కషన్, రాజీవ్ గృహకల్ప రోడ్, సెంట్రల్ జైలు దగ్గర, రామాంజనేయ పురం, కడపలో లభిస్తాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 99660 06758, 9849311680 సెల్ నంబర్ సంప్రదించాలని పేర్కొన్నారు.

24 నుంచి 'పది' అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-కడప అర్బన్ : పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతాయని డిఇఒ అనురాధ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైయస్సార్ జిల్లాలో 16 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్స్ వెబ్‌సైట్ పొందాలని పేర్కొన్నారు.

డ్రైయినేజీ నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-కడప అర్బన్ : కార్పొరేషన్ కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్ మార్నింగ్ విజిట్‌లో భాగంగా బుధవారం గురుకుల విద్యాపీఠ్, డిస్ట్రిక్ కోర్ట్, మహా ప్రస్థానం బురియల్ గ్రౌండ్, మున్సిపల్ స్టేడియం వర్క్స్, ఎస్‌బిఐ కాలనీలలో జరుగుతున్న స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులను ఇంజినీరింగ్ విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. గురుకుల విద్యాపీఠ్ స్ట్రోమ్ వాటర్ వర్క్స్ పనులను పరిశీలించి డ్రైన్, రోడ్డు మధ్య గ్యాప్స్ రిస్టోరేషన్ చేయు విధంగా చర్యలను చేపట్టాలని కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు.

26న నెలనెలా సీమ సాహిత్యం

ప్రజాశక్తి కడప అర్బన్
యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 132వ సదస్సును ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాదరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 132వ సదస్సులో 'రాయలసీమ నదీ సాహిత్యం' (మొదటి ప్రసంగం)' అనే అంశంపై సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి ప్రసంగిస్తారని తెలిపారు. ఉదయం 10 గంటలకు పరిశోధన కేంద్రంలో సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

అన్నమయ్య జిల్లాలో జన్మించడం ఎంతో అదృష్టం

ప్రజాశక్తి-కడప
పద కవితా పితామహుడు అన్నమయ్య మన జిల్లాలో జన్మించడం ఎంతో అదృష్టమని డాక్టర్ కె.గోపీనాథ్ అన్నారు. అన్నమయ్య జయంతి సందర్భంగా బుధవారం అన్నమయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద కవిత పితామహుడు అన్నమయ్య అదిగో అల్లదిగో, బ్రహ్మ ఒకటే పరబ్రహ్మ ఒక్కటే అన్న ఎన్నో ఉత్తమ భక్తి గీతాలు అందించి ప్రతి ఒక్కరి గుండెల్లో నిలిచిపోయారన్నారు. వెంకటేశ్వర స్వామికి ఎంతో భక్తుడైన అన్నమయ్య మన జిల్లాలో జన్మించడం ఎంతో అదృష్టమని, రాబోయే రోజులలో అన్నమయ్య జయంతి ఉత్సవాలను కడప నగరంలో ఘనంగా నిర్వహించడానికి జిల్లా అధికారులు విచ్చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు సంపత్ కుమార్, యునుస్, యోగి పాల్గొన్నారు

ప్రజా సమస్యలు పరిష్కరించండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-కాశినాయన
గ్రామాలలో ప్రజలకు ఉపయోగపడే సమస్యలు మాత్రమే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం మండల ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య చారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి సమస్య పారిశుధ్యం, ఇతర చిన్న చిన్న కార్యక్రమాలు మాత్రమే చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున పెద్ద పెద్ద అభివృద్ధి కార్యక్రమాలు ఏమి చేపట్టలేమని తెలిపారు. మొదటగా అన్ని శాఖల అధికారులు వారి వారి రిపోర్ట్‌ను చదివి వినిపించారు. సమావేశంలో తహశీల్దార్ కృష్ణ, ఎంఇఒ నిర్మల, హౌసింగ్ ఎఇ బాల్‌రెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, ఎపిఎం రామాంజనేయులు, అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు ఎంపిటిసిలు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ మధుసూదన్‌రెడ్డి

మాట్లాడుతున్న బొజ్జా తిరుమలేష్

విద్యా దీవెన డబ్బులు పూర్తి స్థాయిలో విడుదల చేయాలి : టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి-కడప అర్బన్
ముఖ్యమంత్రి బటన్ నొక్కి దాదాపు మూడు నెలలు కావస్తున్నా జగనన్న విద్యా దీవెన డబ్బులు అందక పలువురు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా తిరుమలేష్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కడప నగరంలోని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న విద్యాదీవెన ఆర్భాటంగా ప్రవేశపెట్టినప్పటికీ ఆ పథకం ఐదేళ్లలో ఏ ఒక్క విద్యార్థికి సక్రమంగా సమయం ప్రకారం వేసిన దాఖలాలు లేవన్నారు. ఈ సంవత్సరం మార్చి 1న సిఎం జగన్ కృష్ణా జిల్లా పామూరులో ఎంతో ప్రచార ఆరబాటం చేసుకుని జగనన్న విద్యాదీవెన సొమ్మును విడుదలకు బటన్ నొక్కారని, బటన్ నొక్కి మూడు నెలలు కావస్తున్నా అరకొర విద్యార్థులకు మాత్రమే విద్యా దీవెన అందిందని పేర్కొన్నారు. అధిక మొత్తంలో మిగిలిన డిగ్రీ, ఇంజినీరింగ్, నర్సింగ్ చదువుతున్న విద్యార్థులకు అందలేదన్నారు. కళాశాలల యాజమాన్యాల నుంచి ఫీజు ఒత్తిళ్లు అధికమై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యాదీవెనను నమ్ముకుని అభ్యసిస్తున్న విద్యార్థులకు పరీక్షల సమయంలో ఫీజు కడితేనే హాల్ టికెట్లు ఇస్తామని కళాశాల యాజమాన్యాలు తెగేసి చెప్తున్నారన్నారు. దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాదీవెన సొమ్ము వస్తుందనే నమ్మకంతో చదివిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేయడం మంచిది కాదని తెలిపారు. వెంటనే పూర్తిస్థాయిలో విద్యాదీవెన, వసతి దీవెన డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు ఏటూరి లోకేష్, శివ పాల్గొన్నారు.

26న అండర్-16 పురుషుల క్రికెట్ జట్టు ఎంపికలు

- జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డిప్రసాద్

ప్రజాశక్తి - కడప
ఈ నెల 26వ తేదీన ఉదయం ఏడు గంటలకు కడపలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో అండర్-16 పురుషుల క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, స్టడీ సర్టిఫికెట్ ఒరిజినల్ తో పాటు ఒక సెట్టు జిరాక్స్ కాపీ తప్పనిసరిగా తీసుకొని రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే వారు తప్పనిసరిగా వైట్ డ్రెస్‌తో రావాలని తెలిపారు. ఎవరి క్రికెట్ కిట్ వారే తెచ్చుకోవాలని చెప్పారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2008 సంవత్సరం సెప్టెంబర్ 1వ తేదీ తరువాత గాని లేదా 2010వ సంవత్సరం ఆగస్టు నెల 31వ తేదీ లోపు గాని జన్మించి ఉండాలని తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే వారు కచ్చితంగా నిర్ణీత సమయంలోగా స్టేడియానికి చేరుకోవాలని సూచించారు.

పాల్గొన్న జెవివి నాయకులు, విద్యార్థులు

గొప్ప సంఘ సంస్కర్త రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

బాల్యవివాహాలు, సతీసహగమనాన్ని వ్యతిరేకించిన గొప్ప సంఘ సంస్కర్త రాజారామ్మోహన్‌రాయ్ అని ప్రముఖ కవి, సాహితీవేత్త జింకా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. రాజారామ్మోహన్‌రాయ్ జయంతి వేడుకలను బుధవారం స్థానిక జనవిజ్ఞానవేదిక (జెవివి) కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాజారామ్మోహన్‌రాయ్ బెంగాల్‌లోని రాధానగర్‌లో జన్మించారన్నారు. తల్లి తరణి, తండ్రి రామాకాంత్ అన్నారు. తండ్రి వైష్ణవ బ్రాహ్మణుడు, తల్లి శాక్తేయమాత శక్తిని కొలిచే ఆరాధ్యురాలన్నారు. తల్లిదండ్రులిరువురూ వేర్వేరు మతాల వారు కావడంతో పలు మతాల గురించి క్షుణ్ణంగా తెలుసుకొని సంస్కరించే అవకాశం లభించిందన్నారు. సంస్కృతంలోని ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రాలు చదివి దేవాలయాల్లో పూజాలరులు చేసే విగ్రహారాధనను ఖండించారన్నారు. బ్రహ్మసమాజ్‌ను స్థాపించి మహిళలు, బాలికల విద్యను ప్రోత్సహించారన్నారు. వితంతువుల పునర్వివాహం కోసం గొప్ప సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా అధ్యక్షులు పొలంకి శ్రీరాములు, ఉపాధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, అల్లాబకష్, యువ వాలంటీర్లు అక్షయ, హాసిని, తేజ, భరత్, వేసవి తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులు

విద్యార్థులకు నీతి కథల బోధన

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం గ్రంథాలయ అధికారి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నీతి కథలు వివరించారు. గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ జూన్ 7వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పాటలు, పుస్తకాల పఠనం అలవాటు చేస్తున్నామన్నారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

40 శాతం రాయితీతో వేరుశనగలు పంపిణీ

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వం మండలానికి మంజూరు చేసిన వేరుశనగ కాయలను రైతులకు 40 శాతం రాయితీతో పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఆ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా మండలానికి 80 క్వింటాళ్లు వేరుశనగ కాయలు మంజూరయ్యాయని తెలిపారు. కదిరి-6(కె-6), టి.సి.జి.యస్.1694 రకం వేరుశనగ కాయలు క్వింటాల్ పూర్తి ధర రూ.9,500 కాగా రూ.3,800 రాయితీ పోనూ రైతు వాటా కింద రూ.5,700 చెల్లించాలన్నారు. కదిరి లేపాక్షి-1812 రకం క్వింటాల్ పూర్తి ధర రూ.8,700 కాగా.. రూ.3,480 రాయితీ పోనూ రైతు వాటా రూ.5,220 చెల్లించాలని తెలిపారు. పంట సాగు చేసే రైతులు మాత్రమే ఆయా ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, మొబైల్ నెంబర్ తీసుకురావాలని ఎఒ కోరారు.

ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి- వేంపల్లె

ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి కోరారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి పాలనలో ఆరోగ్యశ్రీ పథకం అనారోగ్య శ్రీ పథకంగా తయారైందని విమర్శించారు. పేరుకే నవరత్నమని ఆచరణలో నకిలీ నవరత్నమని ఎద్దేవా చేశారు. ఆరోగ్యశ్రీ కాంగ్రెస్ మానస పుత్రిక అన్నారు. పేదలకు కూడా ఉచితంగా కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో 2007లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించిందన్నారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేశాయన్నారు. ఎంతో మంది రోగులు చావు అంచులకు పోయి పునర్జన్మ పొందినట్లు చెప్పారు. కానీ దురదృష్టవశాత్తూ జగన్ పాలనలో ఆరోగ్యశ్రీ పథకం సరిగ్గా అమలు కాలేదని తెలిపారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదన్నారు. దీంతో ఆ ఆసుపత్రులు ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నట్లు చెప్పారు. గత ఆగస్టు నుండి బిల్లులు చెల్లించకపోవడంతో ఆసుపత్రుల్లో పని చేసే సిబ్బందికి జీతాలు ఇవ్వలేక పోతున్నట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలిపి వేయడంతో ఎంతో మంది రోగులు తమ ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే బిల్లులు చెల్లించి ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. రోగుల ప్రాణాలు కాపాడాలని తులసిరెడ్డి కోరారు.

టీకా లక్ష్యాన్ని పూర్తి చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

క్షయ వ్యాధి నివారణకు ఇస్తున్న టీకాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని డిఐఒ డాక్టర్ ఉమామహేశ్వరరావు సూచించారు. బుధవారం స్థానిక 1,3వ గ్రామ సచివాలయ పరిధిలో వేస్తున్న టీకా కార్యక్రమాన్ని ఉమామహేశ్వరరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్బల్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం వేగవంతం చేయాలని ఆదేశించారు. టీకాలపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు స్వాతిసాయి, సిహెచ్‌ఒ మునిరెడ్డి, సిహెచ్‌ఒ వెంకటరత్నం, ఎంపిహెచ్‌ఇఒ ఫకృద్దీన్, సూపర్‌వైజర్, అరుణాదేవి, ఎంఎల్‌హెచ్‌పిఎస్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిఐఒ ఉమామహేశ్వరరావు

గుంతలు తీసి.. మట్టిని వదిలేసి..

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక రైల్వేస్టేషన్ సమీపం నుండి కడప బైపాస్ వరకు కొన్నేళ్ల క్రితం రోడ్డు వేశారు. వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. రైలు ప్రయాణం చేసే వారు, వాహనదారులు కడప బైపాస్ నుండి రైల్వేస్టేషన్ రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఈ దారిలో వెళ్లేందుకు ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. విద్యుత్ స్తంభాలు, దీపాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కాంట్రాక్టు ఇచ్చింది. ముద్దనూరుకు చెందిన కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాడు. సదరు కాంట్రాక్టర్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు రోడ్డు మధ్యలో గుంతలు తీశారు. స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు (బట్టర్ ఫ్లై లైట్లు)ఏర్పాటు చేశారు. విద్యుత్ స్తంభాల కోసం గుంతలు తీసి మట్టిని మాత్రం రోడ్డుకు ఇరువైపులా అలాగే వదిలేశారు. వర్షం కురవడంతో రోడ్డుపై ఉన్న మట్టి బురదమయం కావడంతో వాహనదారులు, బాటసారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్ రోడ్డుపై వదిలేసిన మట్టిని తొలగించకున్నా.. అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటాం

జమ్మలమడుగులో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులచే మాబ్ ఆపరేషన్ డ్రిల్

ర్యాలీగా వస్తున్న పోలీసులు, (ఇన్‌సెట్) ప్రజల సమక్షంలో డెమో ఇస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగులో ఎలాంటి పరిస్థితులు తలెత్తినా ధీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రొబెషనరీ డిఎస్పీ శ్రీకాంత్ తెలిపారు. స్థానిక పాత బస్టాండ్‌లో బుధవారం ఉదయం సార్వత్రిక ఎన్నికలు-2024 కౌంటింగ్ నేపథ్యంలో పోలీసు సిబ్బంది సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించటమే ధ్యేయంగా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు డిఎస్పీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ సిబ్బందితో 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, హింసాత్మక చర్యలకు పాల్పడినా, అల్లర్లు చేస్తున్న సమయాల్లో ఎలా స్పందించాలి.. జన సమూహాలను కంట్రోల్ చేయుటకు మొదటగా వార్నింగ్ ఇచ్చుట, అది వినకపోతే మెజిస్ట్రేట్ అనుమతితో టియర్ గ్యాస్ ప్రయోగించుట, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీఛార్జి, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ ప్రయోగించుట, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్, అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయుట వంటివి డెమో ద్వారా ప్రదర్శించామన్నారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తూ విధ్వంసానికి ప్రయత్నించే అల్లరిమూకలను అణచి వేసేందుకు, అత్యవసర సమయంలో పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేలా ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రజాజీవనం సాగేలా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లు, గొడవలు సృష్టించే వ్యక్తుల పట్ల చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆనంద్, జమ్మలమడుగు అర్బన్ సిఐ కరుణాకర్, రూరల్ సిఐ గోపాల్ రెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గొడవలు చేస్తే కఠిన చర్యలు తప్పవు : డిఎస్‌పి

మాట్లాడుతున్న డిఎస్‌పి టి.వెంకటేశులు

ప్రజాశక్తి - మైదుకూరు

ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకు అమలులో ఉంటుందని, ఎన్నికల ఫలితాల రోజున హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మైదుకూరు డిఎస్పీ టి.వెంకటేశులు హెచ్చరించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ముఖ్య నాయకులతో రాబోవు ఎన్నికల ఫలితాల రోజు వారు ప్రవర్తించవలసిన తీరును వివరించారు. 144 సెక్షన్ అమలులో ఉందని, నలుగురికి మించి గుమికూడి ఉండరాదని డిఎస్పీ సూచించారు. ఎన్నికల కౌంటింగ్ రోజున గ్రామాల నుండి రాజకీయ పార్టీల కార్యకర్తలను, ఇతర వ్యక్తులతో కానీ మైదుకూరుకు రాకూడదన్నారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. కౌంటింగ్ అనంతరం బాణసంచా పేల్చడం నిషేధమన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. సమావేశంలో సిఐ ఎపి మస్తాన్, ఎస్ఐ బి.ఘణా మద్దిలేటి, సిబ్బంది, రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వేంపల్లె : రాజకీయ పార్టీల నాయకులు గ్రామాల్లో గొడవలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ చాంద్ బాషా హెచ్చరించారు. మండలంలోని రామిరెడ్డిపల్లి, కత్తులూరు గ్రామాల్లో బుధవారం సిఐ చాంద్ బాషా ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పోలీసుస్టేషన్‌లో రౌడీషీటర్లకు, ఆయా పార్టీల రాజకీయ నేతలకు సిఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో కౌటింగ్ రోజు ఎలాంటి గొడవలు పడవద్దని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దన్నారు. రౌడీ షీటర్లు, నేర చరిత్ర గల వ్యక్తులపై నిఘా ఉందన్నారు. గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు, హింసాత్మక సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేర చరిత్రగల వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ చాంద్ బాషా

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ముద్దనూరు రోడ్డు సమీపంలోని వాసవి కాలనీలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమానికి భక్తులు తరలి వచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు ఆలయ కమిటీ పంపిణీ చేసింది.

వంద శాతం ఉత్తీర్ణత.. శ్రీవెంకటేశ్వర స్కూల్ ఘనత

తక్కువ ఫీజు, నాణ్యమైన విద్య, క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యత, చిన్న వయసు నుంచే కంప్యూటర్ శిక్షణ

ప్రశాంత వాతావరణంలో ఉన్న శ్రీవెంకటేశ్వర హైస్కూల్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ప్రతి సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం 'శ్రీ వెంకటేశ్వర హై స్కూల్' ఘనత. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు గురించే ఆలోచిస్తారు. మంచి చదువు, క్రమశిక్షణ, సంస్కారం నేర్పించే పాఠశాలను ఎంచుకునే ముందు తల్లిదండ్రులకు మొదటగా గుర్తుకు వచ్చే పాఠశాల శ్రీవెంకటేశ్వర హై స్కూల్. తల్లిదండ్రుల హృదయాల్లో అంతటి చెరగని ముద్రను శ్రీవెంకటేశ్వర స్కూల్ వేసుకుంది. ఈ సందర్భంగా శ్రీవెంకటేశ్వర హైస్కూల్ కరస్పాండెంట్ చంద్రఓబుల్‌రెడ్డి 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ పట్టణంలో 1993లో పాఠశాలను స్థాపించామన్నారు. కేవలం 50 మంది విద్యార్థులతో మొదలైన పాఠశాల అంచలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం దాదాపు 380 మంది విద్యార్థులతో ముందుకు సాగు తోందని తెలిపారు. పట్టణంలో 30 ఏళ్లుగా విద్యా రంగంలో తిరుగులేని సంస్థగా విరజిల్లుతోందని తెలిపారు. నర్సరీ నుండి పదవ తరగతి వరకు విద్యను అందిస్తున్నామన్నారు. ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులకు ఐఐటి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. పలువురు విద్యార్థులు ఐఐటిలో సీట్లు సాధించారని తెలిపారు. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు దేశవిదేశాల్లో ఉద్యోగాల్లో స్థిరపడినట్లు తెలిపారు. ఎంతోమంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో దేశవిదేశాల్లో ఉండగా, మరికొందరు ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లోనూ, ఆర్మీ లోనూ, పోలీసులుగానూ దేశానికి సేవ చేస్తున్నారని వివరించారు. ఇంకొందరు యూనివర్సిటీ ప్రొఫెసర్లు, బ్యాంకు ఉద్యోగులు, ప్రయివేట్ ఉద్యోగులుగానూ పనిచేస్తూ అన్ని రంగాల్లో స్థిరపడినట్లు తెలిపారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషులో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి ఫలితాల్లో పలుమార్లు మండల, పట్టణ టాపర్లుగానూ, జిల్లా స్థాయి ర్యాంకర్లుగా తమ విద్యార్థులు రాణించడం గర్వంగా ఉందన్నారు. ప్రత్యేక స్టడీ హవర్స్ కార్యక్రమాల ద్వారా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామన్నారు. ప్రతినెల రెండవ శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి, వారి పిల్లల ప్రోగ్రెస్‌లను తెలియజేస్తున్నామన్నారు. చదువు సంస్కారంతోపాటు విద్యార్థుల క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. విద్యార్థులకు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతిభ అవార్డులు, చెకుముకి టాలెంట్ టెస్ట్, మన ఊరి కోసం టీం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌ల్లో విద్యార్థులు అవార్డులు, రివార్డులు సాధించడం హర్షణీయమన్నారు. క్రీడా మైదానం, అధునాతన సౌకర్యాలతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేశామని తెలిపారు. దూరప్రాంత విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కూడా కల్పించామన్నారు. విద్యార్థులకు తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని చంద్ర ఓబుల్‌రెడ్డి తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికిగానూ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, విద్యార్థుల కలలను 'శ్రీ వెంకటేశ్వర హైస్కూల్' ద్వారా సాకారం చేసుకోవాలని తల్లిదండ్రులను కోరారు.

కరస్పాండెంట్ చంద్రఓబుల్‌రెడ్డి

విద్యార్థులకు ఆహ్లాదాన్నిచ్చే తరగతి గదులు

మాట్లాడుతున్న తులసీశ్వర్ యాదవ్

నారాయణ, చైతన్య విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వర్క్‌షాప్ పేరుతో ప్రయివేట్ ఉపాధ్యాయులను వేధిస్తున్న చైతన్య, నారాయణ విద్యా సంస్థలుపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి తులసీశ్వర్ డిమాండ్ చేశారు. స్థానిక పాతబస్టాండ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం వేసవి సెలవులు జూన్ 12 వరకు ఇచ్చిందన్నారు. కానీ జిల్లాలో చైతన్య, నారాయణ విద్యా సంస్థల యాజమాన్యాలు ప్రయివేట్ ఉపాధ్యాయులకు వేసవి సెలవులు ముగియక ముందే వర్క్‌షాప్ పేరుతో జిల్లాలో క్లాసులు పెట్టడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమన్నారు. వెంటనే విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌జెడి ప్రయివేట్ ఉపాధ్యాయులను క్యాన్వాస్ పేరుతో, ఇతర వర్క్‌షాప్‌ల పేరుతో వేధిస్తే చర్యలు తీసుకుంటామని సర్క్యులర్ జారి చేసినా కూడా ఉన్నతాధికారుల ఆదేశాల బేఖాతర్ చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటున్నా కార్పొరేటు విద్యా సంస్థలు చైతన్య, నారాయణ విద్యా సంస్థలపై విద్యా శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూరి, రాఘవ, నాగేంద్ర పాల్గొన్నారు.

ఆలయంలో హీరోయిన్ సమయారెడ్డి

వెంకటేశ్వర ఆలయంలో హీరోయిన్ సమయారెడ్డి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో డియర్ ఉమా సినిమా హీరోయిన్, నిర్మాత సమయారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఆలయ అర్చకుడు హరి ప్రసాద్ ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డియర్ ఉమా సినిమా త్వరలోనే విడుదల కాబోతుందని, ప్రేక్షకులందరూ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త హుస్సేన్ పీరా, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న సంఘ నాయకులు

9న విద్యార్థుల ప్రతిభకు పురస్కారాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రతిభగల తొగటవీర క్షత్రియ విద్యార్థులకు జూన్ 9న ప్రొద్దుటూరు తొగటవీర క్షత్రియ ఉద్యోగులు, వృత్తి నిపుణుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు ఈడెం లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి సంబంధించి పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన గవర్నమెంట్, జడ్పీ హైస్కూల్, మున్సిపల్ స్కూల్ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో మొదటి, రెండవ, మూడవ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని సేవా సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు వసంతపేటలోని సంఘ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. సమావేశంలో అసిస్టెంట్ సెక్రటరీ పల్లా శివ నాగయ్య, వైస్ చైర్మన్ బొలిశెట్టి శ్రీను, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు హరి, గోవిందు రామమునయ్య పాల్గొన్నారు.

పథకాల లబ్ధి చేకూరేందుకు సర్వే

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ పథకాలు విభిన్నప్రతిభావంత విద్యార్థులకు అందేందుకు ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నట్లు ఎంఇఒ స్టాలిన్ ఐజాక్ చెప్పారు. బుధవారం వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో ఇంటింటికి స్టాలిన్ ఐజాక్, భవిత కేంద్రం ఐఇఆర్టీలు యశోద, సుజాత వెళ్లి విభిన్నప్రతిభావంత విద్యార్థుల సర్వేను చేపట్టారు. ఈ సందర్భంగా స్టాలిన్ ఐజాక్ మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతోపాటు విభిన్నప్రతిభావంతులు కూడా పాఠశాలకు వెళ్లి విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో ఆ జాబితాను తయారు చేసేందుకు సర్వే చేస్తున్నామన్నారు. సర్వే వల్ల ప్రభుత్వం అందించే పథకాలు వారికి అందుతాయన్నారు. సర్వే జూన్ 9వ తేదీ వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ స్వర్ణలత, ఆశా కార్యకర్తలు, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వర్షం వస్తే ఇలా.. పట్టించుకోకపోతే ఎలా..!

ప్రజాశక్తి - ఖాజీపేట

వర్షాకాలం మొదలైంది. సీజనల్ వ్యాధులు ప్రభలే ఆస్కారం లేకపోలేదు. చిన్నపాటి వర్షం వస్తే చాలు పలుచోట్ల వీధులన్నీ చెరువులను తలపిస్తుంటాయి. వర్షపు నీరు బయటకు పోయేందుకు మురుగు కాలువలు ఏర్పాటు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని గ్రామీణులు వాపోతున్నారు. వర్షాకాలం మొదలైందంటే వ్యాధుల భయం తమను వెంటా డుతుంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని పుల్లూరు పంచాయతీ రహమత్ ఖాన్‌పల్లె లో వీధులన్నీ చిన్నపాటి వర్షానికి జలమ యమవుతున్నాయి. వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉంటోంది. దోమకాటు వల్ల జ్వరాలతో అనారోగ్యానికి గురికావాల్సి వస్తుందని గ్రామస్తుల భయాం దోళనను వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు పోయేందుకు డ్రయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడం వల్లనే ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. పంచాయితీ అధికారులు స్పందించి మురుగు నీరు బయటకు వెళ్లేలా, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుచున్నారు.

రహమత్‌ఖాన్‌పల్లెలోని ఓ వీధి